క్లుప్తంగా

పార్టీ పథకాలను ప్రజలకు చేరవేయాలి


చినబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయాలని అందుకు తగు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులైన వాసంశెట్టి చినబాబును నగరంలో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా సన్మానించారు. తనకు పదవి వచ్చేందుకు అన్ని విధాలా సహకరించిన ఎమ్మెల్యే చిట్టిబాబును పూలమాలలతో చినబాబు సత్కరించారు. ప్రతిగా చినబాబును ఎమ్మెల్యే సత్కరించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి చంద్రశేఖర్, వాసంశెట్టి రాంబాబు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, కొర్లపాటి కోటబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్, కుసుమ శ్రీను, వెన్నపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు

మండల పార్టీ అధ్యక్షుడిని సత్కరించిన చిట్టిబాబు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం మండల శాఖ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన నక్కా వెంకటేశ్వరరావు నగరం గ్రామంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును మర్యాదపూరకంగా కలిశారు. ఎమ్మెల్యే చిట్టిబాబుకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్వరరావును దుశ్శాలువాతో చిట్టిబాబు సత్కరించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారిని అభివృద్ధి చేయండి


నందంపూడిలో అధ్వానంగా ఉన్న రహదారి

అంబాజీపేట: నందంపూడి నుంచి జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో నడిచేందుకు వీలు లేకుండా ఉందని తక్షణమే అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారి అంతా గుంతలతో నిండి బురదగా మారిపోతుందన్నారు. మోకాలి లోతు బురదలో నడుచుకుంటూ హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయోత్పత్తులు తరలించే రైతులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నామని, బాటసారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

ప్రపంచ నదుల దినోత్సవం


సఖినేటిపల్లి రేవు వద్ద గోదావరి తీరం వెంబడి శుభ్రం చేస్తున్న విద్యార్థులు, బోధన సిబ్బంది

సఖినేటిపల్లి: ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా నదులను కాపాడుకుందాం, భవిష్యత్ తరాలకు కానుకగా అందిద్దాం అన్న నినాదంతో ఆదివారం సఖినేటిపల్లిలంక గ్రామ పరిధిలోని సఖినేటిపల్లి రేవు వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టారు. సఖినేటిపల్లిలంకకు చెందిన ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్, తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతి ఆధ్వర్యాన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, బోధనా సిబ్బంది వ్యర్థపదార్థాలను ఏరివేసే పనులు నిర్వహించారు. రేవు వద్ద గోదావరి తీరం వెంబడి, పరిసర ప్రాంతాల్లోను వారు శుభ్రం చేశారు. కాలుష్య రహిత హరిత తోరణంగా తీరాన్ని మార్చడానికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ప్రభావతి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి భారీ విరాళాలు అందుతున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన జి.నాగజ్యోతి రూ.25 వేలు, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.వెంకట సత్య నరసింహ విజయలక్ష్మి రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన యు.బులివెంకట నాగ భీమశంకర్ రూ.10,116, పేరుపాలేనికి చెందిన కె.రవి రూ.10 వేలు విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.


ఎల్.గన్నవరంలో వినాయకుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


పోతాయిలంకలో గణపతిని దర్శించుకుంటున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు


చెముడులంకలో గణపతి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు


కొత్తపేటలో గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు

- పలుచోట్ల హోమాలు
- భక్తులకు భారీ అన్నదానాలు
- ఘనంగా నిమజ్జనాలు

కొత్తపేట: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి ఆలయాలు, నవరాత్ర పందిళ్లలో ప్రత్యేక పూజ, హోమం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దానిలో భాగంగా స్థానిక చింతామణి గణపతి పందిరి ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ చొప్పెర్ల రాంబాబు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసుల రామచంద్ర శర్మ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు సుమారు 50 మంది భక్త దంపతులతో గణపతి హోమం, గరిక పూజ, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు కోసూరి సత్తిబాబు, వానపల్లి సుబ్బారావు, పాలూరి జయప్రకాష్‌నారాయణ (జేపీ), శ్రీఘాకోళ్లపు చిన్ని, బొడ్డు సుబ్రహ్మణ్యం, శ్రీకాకోళ్లపు శ్రీను తదితరులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి హోమం

మామిడికుదురు: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మొగలికుదురులోని జగ్గన్నపేట శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం చౌడేశ్వరి సేమా సమితి ఆధ్వర్యంలో 108 గణపతుల ఆహ్వాన సహిత శ్రీలక్ష్మీ గణపతి హోమం ఘనంగా జరిగింది. అలివేలు మంగ, పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. వేద మంత్రాల నడుమ ఈ పూజ వైభవంగా జరిపించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మొగలికుదురులో శ్రీలక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

చెముడులంకలో..

ఆలమూరు: గణపతి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని మండలం చెముడులంకలో ఆదివారం లక్ష్మీ గణపతి హోమం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో వేద పండితుల బృందం హోమం నిర్వహించింది.

లక్ష గరిక పూజ

రాజోలు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా రాజోలు గాయత్రీ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష గరిక పూజ ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సత్తిరాజు గోపాలకృష్ణ కుటుంబ సభ్యుల సహకారంతో వేదపండితులు కాశీభొట్ల పార్వతీ దీక్షితులు, ఫణికుమార్ ఆధ్వర్యంలో పూజ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. న్యాయవాదులు సత్తిరాజు వెంకటేశ్వరరావు, సత్తిరాజు స్వామి, స్థానిక పెద్దలు సూర్యనారాయణమూర్తి, కనకదుర్గ నాగేశ్వరరావు, రామచంద్రుడు, రవినాథ్, గాయత్రీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని నెలకొల్పిన వినాయక మండపాల వద్ద భారీ అన్నసమారాధనలు, నిమజ్జనాలను నిర్వహించారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద వేంచేసిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఉన్న వినాయకుడు ధాన్యం అలంకరణతో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. గంగలకుర్రు అగ్రహారం శివారు ముషిణివారిపాలెం, మట్టపర్తివారిపాలెం, గంగలకుర్రులోను, అంబాజీపేట శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయభేతాళ స్వామి ఆలయం వద్ద, పోతాయిలంక గణపతి ఆలయం వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. స్వామి వారిని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, మట్టపర్తి హరి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వక్కలంకలో..

గణపతి నవరాత్రులను పురస్కరించుకుని స్వామి వారి నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకంలో గణపతి నిమజ్జనాలు నిర్వహించే ప్రధాన పంట కాలువ వద్ద ఆదివారం భద్రతా ఏర్పాట్లు చేశారు. వారు మాట్లాడుతూ స్వామి ఊరేగింపులో మద్యం తాగి పాల్గొనవద్దన్నారు. పంట కాలువలో నిమజ్జనం చేసే సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండి నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఎవరూ మితిమీరి వ్యవహరించవద్దని హెచ్చరించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: నాగుల్లంకలో చిన రామాలయం వద్ద వేంచేసిన బాల గణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఆదివారం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. స్వామి వారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి లడ్డూను దొమ్మేటి రామకృష్ణ రూ.6050లకు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమాలకు ఆలయ కమిటీ నాయకులు ఆధ్వర్యం వహించారు. తాటికాయలవారిపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద గణపతి లడ్డూను పంతాల గాంధీ అనే భక్తుడు రూ.5000కు వేలంలో దక్కించుకున్నారు. అలాగే తాటికాయల బుజ్జి రూ.3300లకు దక్కించుకున్నారు. లంకల గన్నవరం గ్రామ శివారు పెదలోన ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం పవిత్ర వైనతేయ నదీపాయలో నిమజ్జనం చేశారు.

అవినీతికి తావులేకుండా పథకాల అమలు

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- తాటిపాకలో గడప గడపకూ..

రాజోలు: అవినీతికి తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తాటిపాక మెయిన్ రోడ్డు, కొత్త కాలనీ, ఒరు వంతెన ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాపాక ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. తమ ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే రాపాకకు రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రోజారమణిలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ గతంలో ఏదైనా సంక్షేమ పథకాలు పొందాలంటే లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడేవారన్నారు. మధ్యవర్తులను బ్రోకర్లను ఆశ్రయించి కొంత సొమ్ము వారికి ముట్టజెప్పి పథకాలు పొందేవారని ఆక్షేపించారు. ప్రస్తుతం సీఎం జగన్ పాలనలో అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. దీని కోసం గ్రామాల్లో సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తీసుకుని వచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సాధించిందన్నారు.


గుబ్బలపాలెం గ్రామ శాఖ అధ్యక్షుడు రామారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు


తాటిపాకలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

పింఛన్‌దారులు ఎలాంటి ఇబ్బందులు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకుండానే నేరుగా ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారన్నారు. అలాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని ఎమ్మెల్యే రాపాక విజ్ఞప్తి చేశారు. సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరు రాణి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మానుకొండ బాబురావు, గ్రామశాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, కంచర్ల శేఖర్, గుబ్బల మనోహర్, మద్దుల కాసు, బొంతు రమేష్, చెల్లింగి చినబాబు, పరంశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గుబ్బలపాలెం గ్రామకమిటీ ఎన్నిక

మలికిపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన ముడిపడి ఉందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. ఆదివారం మండలంలోని గుబ్బలపాలెం గ్రామ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక అయింది. గ్రామ శాఖ పార్టీ అధ్యక్షుడిగా యల్లమిల్లి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు కమిటీ సభ్యులకు పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు, రొక్కాల వెంకట్, గుండుమేను శ్రీనివాస్ యాదవ్, ఉల్లూరి శ్రీను, గుండుమేను పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘ మండలశాఖ కార్యవర్గం

పి.గన్నవరం: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం పి.గన్నవరం మండలశాఖ అధ్యక్షుడిగా శేరు గంగా దుర్గా ప్రసాద్ నియమితులయ్యారు. కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మండల శాఖ కార్యవర్గాన్ని నియమించారు. మండల శాఖ చైర్మన్‌గా లంకే చిరంజీవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆరధాని ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్లుగా కొపనాతి తాతాజీ, కామాడి దశరథ రామయ్య నియమితులయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు రోటరీ సత్కారాలు


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన రోటరీ ప్రతినిధులు

రాజోలు: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు రాజోలు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఏడిద కవీంద్ర, చిట్నీడి లక్ష్మణరావుల ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఏఎస్‌ఆర్‌కే రాజు, కేవీ రాఘవరావు, ఆర్.చెల్లాయమ్మ, ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్న వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, పెచ్చెట్టి రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ నల్లి మనోహరం మాట్లాడుతూ రోటరీ విద్యా వ్యవస్థకు అందిస్తున్న సేవలను కొనియాడారు. రోటరీ జిల్లా గవర్నర్ నల్లి శివశంకర్, డాక్టర్ బసవా వరహాలు, దార్ల పెదబాబు, మహ్మద్ కిష్వర్, నామన షణ్ముఖ్, ఐ.సూర్యనారాయణ తదితరుతు పాల్గొన్నారు.

వాడపాలెంలో నేడు నాటక ప్రదర్శన

కొత్తపేట: మండలంలోని వాడపాలెం పాత మార్కెట్ వీధి శ్రీఆది గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో సోమవారం రాత్రి దేవనర్తకి, సత్యహరిశ్చంద్ర (కాటిసీను) పౌరాణిక నాటకాలు ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యుడు గనిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఏటా వాడపాలెంలో గనిశెట్టి చంద్రశేఖర్, బండారు భాస్కరరావు, సింగిరెడ్డి గోవిందుస్వామి, కురచ ప్రకాశరావు తదితర కమిటీ సభ్యులు, కళాపోషకులు నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో నాటక, సాంస్కృతిక ప్రదర్శనలు పునరుద్ధరించిన విషయం తెలిసిందే. విధిగా ప్రస్తుత రంగస్థల రారాజు, అభినవ హరిశ్చంద్రుడిగా ఖ్యాతిఘడించిన జూనియర్ డీవీ సుబ్బారావును ప్రత్యేకంగా తీసుకువచ్చి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది విభిన్నంగా తొలుత దేవనర్తకి, అనంతరం సత్యహరిశ్చంద్ర (కాటిసీను) నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జూనియర్ డీవీ సుబ్బారావు దేవనర్తకిలో భవానిశంకరుడు, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు పాత్రలు పోషిస్తుండగా, కడప రత్నశ్రీ దేవనర్తకి, చంద్రమతిగా, జబర్దస్త్ అప్పారావు సుబ్బారావుగా, ఇతర పాత్రల్లో ప్రముఖ రంగస్థల నటులు నటిస్తున్నారు. కళాభిమానులు, కళా పోషకులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి రెండు నాటక ప్రదర్శనలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.


జూనియర్ డీవీ సుబ్బారావు


రత్నశ్రీ


జబర్దస్త్ అప్పారావు

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పురస్కరించుకుని ఈనెల 30 నుంచి ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యనిపుణులు వైద్యసేవలను అందజేస్తారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్‌ఈ ఏవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. తాటిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోంపల్లి, పొదలాడ, తాటిపాక, రాజోలు, కూనవరం తదితర గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు ఇంటింటికి వెళ్లి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి వారికి డెంగీ, మలేరియా పరీక్షలను కూడా నిర్వహిస్తున్నారు.

సఖినేటిపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఆదివారం స్థానిక బళ్ళపేటలో సఖినేటిపల్లి పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. ఎంఎల్‌హెచ్‌పీ ఆర్.షాలిని బీపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. వెంట ఆశా కార్యకర్త బేబీ సరోజిని పాల్గొన్నారు.

మామిడికుదురు: మండలంలోని పెదపట్నంలంకలో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వానపల్లిలో మహిళకు బీపీ టెస్ట్ చేస్తున్న సిబ్బంది, మరో మహిళకు టోకెన్ అందజేస్తున్న డాక్టర్ హర్ష

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. ఈ నెల 30 నుంచి సచివాలయాల పరిధిలో ఒకచోట జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి పీహెచ్‌సీల సిబ్బంది ఇంటింటా అనారోగ్య బాధితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం అవిడి పీహెచ్‌సీ పరిధిలో మోడేకుర్రు-2, పలివెల-1 సచివాలయాల పరిధిలో, వానపల్లి పీహెచ్‌సీ పరిధిలో కొత్తపేట-2, వానపల్లి -2, 3, వాడపాలెం-2, బిళ్లకుర్రు, కపిలేశ్వరపురం మండలం కేదార్లంక గ్రామాల్లో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు కేఎస్‌ఎస్‌బీ హర్ష, పి.రవికుమార్, ఆర్ దివ్యపావని, పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారులు, పర్యవేక్షణ అధికారులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్నారు. ఆయా కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను ఆరా తీస్తున్నారు.

గడప గడపకూ నిధులతో పక్కా రహదారులు

మామిడికుదురు: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో గడప గడపకు నిధులు రూ.40 లక్షలతో చేపట్టనున్న పలు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే ఆదివారం భూమిపూజ చేశారు. పెదపట్నంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో పక్కా సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. చెప్పినవన్నీ చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమాల్లో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సర్పంచ్ జాలెం రమణకుమారి, ఎంపీటీసీ జాలెం అనూష, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొమ్ముల శ్రీనివాస్, కడలి శ్రీనివాస్, పార్టీ నేతలు జాలెం కృష్ణారావు, యేడిద లక్ష్మణరావు, తవిటికి వెంకన్నబాబు పాల్గొన్నారు.


నగరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మామిడికుదురు: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన ఆరుగురికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే చిట్టిబాబు నగరంలో తన క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం వారిని ఇతోధికంగా ఆదుకుంటుందని చెప్పారు. సీఎం జగన్ ఎంతో ఔదార్యంతో రోగులకు సహాయం అందిస్తున్నారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో డీటీ


డీటీ భానుప్రకాష్‌ను అభినందిస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని డిప్యూటీ కలెక్టర్ మిమ్మితి భానుప్రకాష్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు డిప్యూటీ కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కాకర శ్రీను, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు ఉన్నారు.

ఇమామ్ అస్కరీకి ఘన నివాళి


నగరంలో షహదత్ వర్ధంతిలో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం 11వ ప్రవక్త ఇమామ్ హసన్ అస్కరికి ముస్లింలు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. హజరత్ ఇస్కరి షహదత్ వర్ధంతి పురస్కరించుకుని మామిడికుదురులోని ఇమామ్ రజా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి ఊరేగించారు. నిశ్శబ్ద మాతంతో నగరం పెద పంజీషా వరకు ప్రదర్శన నిర్వహించారు. పంజీషాలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకుడు సయ్యద్ అబ్బాస్ బాకరీ మజ్లిస్ ఆలపించారు. ఇమామ్ రజా పంజా నుంచి మొదట పీరును తీసి అన్ని పంజాలు తిరుగుతూ మాతం నిర్వహించారు. ధర్మకర్తలు కల్బే ఆబేద్ మాజింద్రాణి, ఆబేద్ అలీ, సర్కిల్ ఫకర్ సాహెబ్, సయ్యద్ రజ్వి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, కోఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, మీర్ హసన్ మషద్దీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం


ర్యాలిలో రాజమ్మ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన పల్లేటి రాజమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

మామిడికుదురు: పాశర్లపూడిలంక నుంచి లూటుకుర్రు వరకు నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం పనుల్ని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. రూ.1.47 కోట్లతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. పీఆర్ ఏఈ చిన్నంరాజు సీసీ రోడ్డు నిర్మాణం పనుల్ని పర్యవేక్షిస్తున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, రోడ్డు నాణ్యతలో ఎక్కడా రాజీ పడేది లేదని చిన్నంరాజు స్పష్టం చేశారు.

సఖినేటిపల్లిలో రోడ్డు ప్రమాదం

సఖినేటిపల్లి: స్థానిక యూనియన్ బ్యాంకు సమీపాన ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పనరామునిలంకకి చెందిన సుందర తాతారావు గాయపడ్డాడు. గాయపడిన అతడికి స్థానికులు సపర్యలు చేశారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న అతణ్ని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టినట్టు స్థానికులు చెబుతున్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధి తాడి సహదేవ్ క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై ఇంకా తమకు స్టేట్‌మెంట్ రాలేదని పోలీసులు చెప్పారు. ఎంక్వయిరీలో ప్రమాదంపై స్పష్టత రావాల్సి ఉంది.

వాడపల్లి వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారి అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అష్టోత్తర పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.